
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025



రేపు ఉద్యోగ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 8న మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు పీడీ ఎస్.వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. '20 కంపెనీల ప్రతినిధులు 2వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు, మెప్మా మిషన్ డైరెక్టర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రత్యేకంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాల్లో యువతీ యువకులు మెప్మా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల'ని పీడీ వెంకటరావు సూచించారు.



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

నేడు పైడితల్లి సిరిమానోత్సవం

విజయనగరం రూరల్/ కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవానికి సమయం ఆసన్నమైంది. అమ్మవారి పండుగలో కీలక ఘట్టమైన సిరిమాను ఊరేగింపును తిలకించేందుకు భక్తకోటి ఇప్పటికే విజయనగరం చేరుకుంది. కొద్దిగంటల్లో వారి కోరిక నెరవేరనుంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తించిన నేపథ్యంలో అమ్మవారికి ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. మరోవైపు పండుగ ఘడియల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. మొక్కులు చెల్లించుకుంటున్నారు. సోమవారం తోలేళ్లు ఘనంగా నిర్వహించారు. హుకుం పేటలోని సిరిమానును అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



జలుమూరులో గౌరమ్మకు భక్తుల పూజలు

భక్తిశ్రద్ధలతో గౌరీపౌర్ణమి

జిల్లావ్యాప్తంగా సోమవారం గౌరీ పౌర్ణమి సందర్భంగా నందన్న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నందన్న, శివ పార్వతుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో కొలువుదీర్చారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నిచోట్ల నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

4లో



నేలబొంతు వసతిగృహానికి రాష్ట్రస్థాయి అవార్డు

మెళియాపుట్టి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు రాష్ట్రస్థాయి స్వచ్ఛ వసతిగృహం అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి అవార్డు అందుకున్నారు.

తీరానికి తాటి

- సముద్ర తీరప్రాంత రక్షణపై అటవీశాఖ దృష్టి
- 11 మండలాల్లో తాటి విత్తనాలు నాటేందుకు చర్యలు



ఇచ్ఛాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీరప్రాంత రక్షణపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏటా విపత్తుల సమయంలో వందల కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తుంటాయి. ఆ సమయంలో ప్రజలకు అపార నష్టం కలుగుతోంది. దీనిని నియంత్రించేందకు తీరప్రాంతం పొడవునా తాటిచెట్లు పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలతోపాటు స్థానిక సంస్థల భాగస్వామ్యం చేయనుంది. జిల్లాలో 193 కిలోమీటర్ల తీరప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 25.12 కిలోమీటర్ల తీరప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్టు తేలింది. గతంలో తాటిచెట్లు ఉన్న ప్రాంతంలో విపత్తులు వచ్చినా పెద్దగా నష్టం జరగలేదు. అందుకే జిల్లాలోని 11 తీర మండలాల్లో తాటిచెట్లు పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. శ్రీకాకుళం డివిజన్‌లో 50వేలు, టెక్కలి, కాశీబుగ్గ డివిజన్లలో 25 వేల చొప్పున తాటి విత్తనాలను తీర ప్రాంతంలో నాటనుంది. కాశీబుగ్గ డివిజన్ పరిధిలో ట్రీ ఫౌండేషన్ తాటిచెట్ల విత్తనాలు నాటేందుకు, రక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చింది. మిగతాచోట్ల సైతం స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేందుకు అటవీ శాఖ ప్రయత్నిస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ తీరప్రాంతం 193 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో వందలాది మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలోని బాహుదా, మహేంద్రతనయా, వంశధార, నాగావళి నదులు సముద్రంలో కలుస్తున్నాయి. నదుల సంగమం వద్ద ఏటా వరదలు పోటెత్తుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మించకపోవడం, నీటి స్థిరీకరణకు అవకాశం లేకపోవడం, కరకట్టల నిర్మాణం చేపట్టకపోవడంతో నీటి ప్రవాహ గమనం పెరిగి ఒకేసారి సముద్రంలోకి నీరు పోటెత్తుతోంది. అదే సమయంలో సముద్రం ఉగ్రరూపం (మిగతా 4వ పేజీలో..)

మంచి నిర్ణయం

తీరప్రాంతంలో తాటిచెట్లు పెంచేలా అటవీ శాఖ మంచి నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని తీర ప్రాంతంలో ఒకప్పుడు ఉండే సరుగుడు, నీలగిరి తోటలు కనుమరుగయ్యాయి. ఇప్పుడు తాటిచెట్లు పెరిగితే మాత్రం తీరానికి కొండంత అండే. ఇది శుభ పరిణామం.

- గోపాల్, మత్స్యకారుడు, డొంకూరు

పరిశుభ్రతకు ప్రాధాన్యం

- చెత్తను సంపదగా మార్చేందుకు కృషి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- జిల్లాలో 46 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా జీవితంలో పరిశుభ్రత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'రాష్ట్రస్థాయిలో రెండు, జిల్లాస్థాయిలో 46 స్వచ్ఛ అవార్డులు జిల్లాకు దక్కడం గర్వకారణం. జిల్లాలో డిసెంబరు నాటికి 95 శాతం ఇంటింటా చెత్త సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం. చెత్తను సంపదగా మార్చేందుకు కృషి చేస్తాం. ప్రతి సచివాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పౌరుల నుంచి సేకరించిన కిలో చెత్తకు రూ.10 చెల్లిస్తాం. ప్రజలు (మిగతా 4వ పేజీలో..)



స్వచ్ఛాంధ్ర అవార్డులను అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మలేషియాలో మన జానపదాలు

- అక్కడి తెలుగు వారికి మన కళలపై శిక్షణ
- పలాస నుంచి శిక్షకులు పయనం

కదలవని వదిలేశారు!

- మూలకు చేరిన ప్రభుత్వ వాహనాలు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా

19న జీఎస్టీపై ఎగ్జిబిషన్

4లో

గదులు చాలక.. గడపపై బోధన

- శిథిలావస్థలో భవనం
- వర్షం కురిస్తే గదుల్లోకి చేరుతున్న నీరు
- ఇదీ లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల పరిస్థితి

6లో

'ఓపి'క ఉండాల్సిందే

- రిమ్స్‌లో ఓపీ కోసం తిప్పలు
- క్యూలో వందలాది రోగులు
- గంటలకొద్దీ నిరీక్షణతో అవస్థలు
- కూర్చొనేందుకు కూడా సౌకర్యం లేని దుస్థితి
- పట్టించుకోని ఆసుపత్రి అధికారులు



రిమ్స్‌లో రోగులతో కిక్కిరిసిన ఓపీ కౌంటర్లు

శ్రీకాకుళం రిమ్స్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పేద లకు ఏ అనారోగ్యం వచ్చినా సరే శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)నే ఆశ్రయిస్తుంటారు. ఈ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలంటే ముందుగా ఓపీలో రిజిస్ట్రేషన్ చేయించుకుని, చీటీ తీసుకుంటేనే చికిత్సకు అనుమతి ఉంటుంది. అయితే రోగులకు ఇక్కడే అసలైన ఇబ్బంది ఎదురవుతోంది. తొలుత రోగికి సంబంధించిన ఆధార్ కార్డు, ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకువెళితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుంది. సంబంధిత రోగి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ ఆధారంగా ఆబా చేస్తారు. అప్పుడు ఆ రోజుకు సంబంధించి సీరియల్ నెంబర్ వస్తుంది. ఈ సీరియల్ నెంబర్‌ను అనుసరించి ఓపీ కౌంటర్‌లో రోగి ఏ అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వచ్చారో తెలుసుకుని వివరాలు నమోదు చేస్తారు. అనంతరం వారికి సంబంధిత విభాగానికి చెందిన ఓపీ టిక్కెట్‌ను ఇస్తారు. అయితే నెట్‌వర్క్ సరిగా లేకపోయినా, కంప్యూటర్‌లో ఆధార్ కార్డు నెంబరు ద్వారా వచ్చిన వివరాలు సరిపోలకపోయినా ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో ఓపీలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. ఇందుకు (మిగతా 4వ పేజీలో..)



కేరాసింగిలో తాత్కాలికంగా రహదారి పనులు

స్పందించారు.. పనులు చేశారు!

- గిరిజన గ్రామాల్లో తాత్కాలిక రోడ్డు నిర్మాణాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల ముమ్మరంగా వర్షాలు కురిశాయి. ఆ వరద ఉధృతికి మెళియాపుట్టి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రహదారులకు కోత' కథనంపై అధికారులు స్పందించారు. సీతంపేట ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్.. ఇంజనీరింగ్ సిబ్బందితో మాట్లాడారు. గిరిజనులకు ఇబ్బందులు లేకుండా దారి కల్పించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం మెళియాపుట్టి మండలంలోని కొండపై ఉన్న కేరాసింగి, గూడ గ్రామాలకు తాత్కాలిక రహదారి పనులు ప్రారంభించారు. అలాగే టీడీపీ గిరిజన మహిళా సంఘం నాయకురాలు బి.ధరణి.. గిరిజనుల సమస్యలను ఆదివారం కలెక్టర్, పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అధికారులు స్పందించి కొండల ప్రాంతాల్లో వర్షానికి నష్టపోయిన వారి వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యను సైతం పరిష్కరించారు. దీంతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.



కంచిలి గురుకులంలో ఆహారాన్ని వడ్డిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

6లో

వరికి తెగుళ్ల పంజా

- రైతులను వేధిస్తున్న దోమపోటు
- ఎర్రగా మారుతున్న పైరు

నరసన్నపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ ఆయకట్టు రైతులు ఈ ఏడాది ముప్పేట దాడికి గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ మధ్యలో భారీ వర్షాల కారణంగా వరి పంట ముంపునకు గురికాగా ఆందోళన చెందారు. తాజాగా వరి పంటకు పొట్టదశలో దోమపోటు తెగులు సోకడంతో మరింత కలవరపడుతున్నారు. జిల్లాలోని 3.94 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాలు వేసేందుకు వర్షాలు సమృద్ధిగా కురిసినా.. ఊబాలు వేసే సమయంలో కాస్త ఆలస్యమయ్యాయి. ఆగస్టు 18 నాటికి జిల్లా అంతటా ఊబాలు పూర్తయ్యాయి. మొన్నటివరకు యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. తర్వాత తుఫాన్‌లతో పంట ముంపునకు గురై ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం పంటకు తెగుళ్ల బెడద వెంటాడుతుండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, సంతబొమ్మాళి, టెక్కలి, పలాస, (మిగతా 4వ పేజీలో..)



జమ్ములో వరిపంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు



నరసన్నపేట: జమ్ములో నందన్నను ఊరేగిస్తున్న దృశ్యం



గార రూరల్: బందరువానిపేటలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు



ఎచ్చెర్ల: గౌరమ్మను పూజిస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో పత్రి కొమ్మలతో ఊరేగింపు..

భక్తిశ్రద్ధలతో గౌరీ పౌర్ణమి

- ఉత్సాహంగా నందన్న ఉత్సవాలు

గౌరీ పౌర్ణమి పూజలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తులసి కోటల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లలో గౌరమ్మను పూజించారు. పున్నమి పూజలలో భాగంగా గ్రామాల్లో నందన్న ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు భారీ స్థాయిలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. నందన్న ఊరేగింపుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



జలుమూరు: అబ్బాయిపేటలో నందన్నకు పూజలు చేస్తున్న భక్తులు



నందిగాం: బెజ్జిపల్లిలో పూజలు చేస్తున్న మహిళలు



హిరమండలం: నందిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మహిళలు

వరికి తెగుళ్ల పంజా

(మూడో పేజీ తరువాయి)

శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస, ఎల్.ఎన్.పేట తదితర మండలాల్లో వరి పైరుకు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. తెల్లదోమపోటు, బూజు తెగులు, ఆకుచుట్టు పురుగు, మెడవిరుపు లాంటి తెగుళ్లు సోకాయి. కొంతమంది రైతులు ఇప్పటివరకూ రెండుసార్లు పురుగు మందు పిచికారీ చేశారు. 40 రోజులకోసారి పురుగుమందు పిచికారీ చేస్తున్నామని, ఎకరానికి కనీసం రూ.3వేలకు పైగా ఖర్చవుతోందని రైతులు అంటున్నారు. యూరియా, పొటాష్ వేసినా తెగుళ్ల కారణంగా పంట ఎదుగుదల లోపించి ఎర్రగా మారుతోందని వాపోతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని దిగులు చెందుతున్నారు. అధికారులు స్పందించి పంటకు తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆందోళన వద్దు

వరి పంటకు తెగుళ్లు సోకిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏవోలు, వీఏఏలు రైతులకు అందుబాటులో ఉంటారు. వారి సలహాలను పాటించి పురుగు మందులు పిచికారీ చేయాలి. అగ్గి తెగులు, బూజు తెగులు, దోమపోటుకు సంబంధించి తరుచూ వరిపైరును రైతులను పరిశీలించాలి. వాతావరణంలో మార్పులు ఫలితంగా దోమ ఆశించే అవకాశం ఉంది. వైరస్ విస్తరించకుండా అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సమాచారం ఇవ్వాలి. **- వెంకట మధు, ఏడీఏ, నరసన్నపేట**

పరిశుభ్రతకు ప్రాధాన్యం

(మూడో పేజీ తరువాయి)

రోడ్లపై చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు సహకరించాలి. వచ్చే ఏడాది నాటికి స్వచ్ఛ అవార్డుల్లో అన్ని శాఖలు పురోగతి సాధించాల'ని తెలిపారు. పరిశుభ్రతపై ప్రతీ సంస్థలోను సుస్థిరమైన సంస్కృతి ఏర్పడాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'ప్రతి ఇంటి నుంచి ఒక స్వచ్ఛ సేవకుడు తయారుకావాలి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు ఇప్పటికే విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. సీఎం చంద్రబాబు సారథ్యంలో దానిని సాధించే దిశగా అడుగులు వేస్తున్నా'మన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. 'ప్లాస్టిక్ మహమ్మారిపై యుద్ధం చేయాలి. స్వచ్ఛాంధ్రను సాధించాల'ని కోరారు. అవార్డు గ్రహీతలను కలెక్టర్, ప్రజాప్రతినిధులు అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అవార్డు గ్రహీతలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో సాయిప్రత్యూష, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 104 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఉప కలెక్టర్ బి.పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యార్థులను ఆదుకోండి

'శ్రీకాకుళం నగరంలో గల పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల జనరల్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దూర ప్రాంతాల నుంచి విద్యనభ్యసించేందుకు వచ్చే పేద విద్యార్థులు అద్దె చెల్లిస్తూ బయట రూముల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి పేద విద్యార్థులను ఆదుకోవాలి. వారు చదువుకునేందుకు సహకరించాల'ని కోరుతూ శ్రీకాకుళం స్టూడెంట్ యూనియన్ నాయకులు బోర గోపి, ముకుందరావులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పాలకొండను జిల్లా కేంద్రంగా చేయండి

పాలకొండను కొత్త జిల్లాగా చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి సభ్యులు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పాలకొండ నియోజకవర్గాన్ని మన్యం జిల్లాలో చేర్చడం వల్ల ప్రజలు పార్వతీపురం జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకొండను జిల్లాగా మార్పు చేయాలని, లేకుంటే ఎప్పటిలాగానే పాలకొండ డివిజన్‌ను శ్రీకాకుళంలోనే విలీనం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

19న జీఎస్టీపై ఎగ్జిబిషన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జీఎస్టీ పై ఎగ్జిబిషన్ నిర్వహించనున్నామని.. అధికారులతో పాటు వ్యాపారులు పాల్గొనాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన సోమవారం అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు, మెడికల్ ఇన్స్యూరెన్స్, నోట్ బుక్స్ తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సంబంధిత ఉత్పత్తులకు సంబంధించి జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు పూర్తి సమాచారం అందజేయాలన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధికారులంతా అప్రమత్తంగా ఉండడంతో ఎటువంటి నష్టం జరగలేదని కలెక్టర్ అభినందించారు. జిల్లా అధికారులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత నగరంగా ప్రకటించారు. అధికారులందరూ వచ్చే గ్రీవెన్స్‌కు ఒక స్టీల్ వాటర్ బాటిల్‌తో రావాలని సూచించారు. తుఫానుల గురించి మూడు రోజులు ముందుగానే సమాచారం ఉంటుందని... విషయాన్ని ముందుగా తెలియజేస్తే అందరూ జాగ్రత్త పడేందుకు అవకాశం ఉంటుందని విపత్తుల నిర్వహణ శాఖ అధికారిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మలేషియాలో తెలుగు వారికి కోలాటంలో శిక్షణ ఇస్తున్న తవిటినాయుడు, సాయికుమార్

మలేషియాలో మన జానపదాలు

- అక్కడి తెలుగు వారికి మన కళలపై శిక్షణ
- పలాస నుంచి శిక్షకులు పయనం

పలాస రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మలేషియా వేదికగా ఉత్తరాంధ్ర జానపదాలు వినిపించబోతున్నాయి. ఇక్కడి జానపద నృత్యాలు కనిపించబోతున్నాయి. స్వాతంత్ర్యం రాకమునుపు వివిధ పనుల కోసం మలేషియాకు వలస వెళ్లిన ఉత్తరాంధ్ర తెలుగువారు ఇప్పటికీ మనభాషను, సంప్రదాయ కళలను పరిరక్షిం చేందుకు కృషి చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉత్తరాంధ్ర కళల అభివృద్ధికీ కృషి చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి కళాకారులను మలేషియా దేశానికి తీసుకెళ్లి... అక్కడి వారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. నేటి తరానికి చెక్కభజన, కోలాటం, బైటో భజన, బుర్రకథలు, సాముగరిడి, గొబ్బి పాటలు వంటి వాటిలో శిక్షణ ఇప్పిస్తున్నారు. దీనిపై తెలుగుభాష జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కళల్లో శిక్షణ ఇచ్చేందుకు కళాపీఠం సభ్యుడైన మత్స తవిటి నాయుడు, కంది సాయికుమార్‌లను మలేషియాకు శనివారం పంపించామని, వీరంతా నెలరోజుల పాటు అక్కడ తెలుగువారు నివసిస్తున్న ప్రాంతాల్లో కళాకారులకు శిక్షణ ఇస్తారని తెలుగుభాష జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు తెలిపారు. మలేషియాలో బాగన్‌దత్తు ప్రాంతంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. బతుకుతెరువు కోసం ఆనాడు మలేషియాకు వెళ్లి జీవనం సాగిస్తున్న తెలుగువారు ఇప్పటికీ తెలుగుభాష మీద మమకారం చూపించడం గర్వకారణమన్నారు. ఈ కళలను నేర్పించేందుకు ఇక్కడివారిని ఆహ్వానించడం ఆనందదాయకమన్నారు. మలేషియా తెలుగు సంఘం, తెలు గుభాష, జానపద కళల సేవకుడు రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణకు వెళ్లినవారి రాకపోకలకు.. మలేషియాలో బస ఏర్పాట్లు అక్కడి తెలుగువారే చేశారు.



మలేసియా తెలుగు సంఘం బాగన్‌దత్తు శాఖ కార్యాలయం

'ఓపి'క ఉండాల్సిందే

(మూడో పేజీ తరువాయి)

సంబంధించి గతంలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రి అధికారులు ట్రైనీ నర్సింగ్ సిబ్బందితో తొలుత ఆధార్ నెంబర్ రిజిస్ట్రేషన్, రోగి అనారోగ్యం తదితర వివరాలను సేకరించేలా ఏర్పాటు చేశారు. దీంతో ఓపీ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరిగేది. కానీ సోమవారం నాడు సర్వజన ఆసుపత్రిలో అటువంటి దాఖలాలు కనిపించలేదు. వందలాదిగా రోగులు క్యూలైన్లలో ఓపీ చీటీల కోసం గంటలపాటు వేచి ఉన్నారు. వారు కూర్చొనేందుకు ఎటువంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఎక్కడా ఆసుపత్రి అధికారుల జాడ కూడా కనిపించలేదు. గంటలకొద్దీ నిరీక్షించే ఓపిక లేక కొంతమంది రోగులు వెనక్కి వెళ్లిపోయారు. తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, నాయకులు ఎన్నిసార్లు ఆసుపత్రి సందర్శనకు వచ్చినా, అధికారులను మందలించినా సరే పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. ఓపీలో నమోదు చేయించుకోవడానికే తిప్పలు పడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఓపీ ప్రక్రియ నమోదయ్యేసరికి మధ్యాహ్నం అయిపోతోంది. ఆ సమయానికి వైద్యులు భోజనానికి వెళ్లిపోతారు. మళ్లీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఓపీ చూస్తారు. దీంతో అంతవరకూ తాము నిరీక్షించాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని నిట్టూర్చుతున్నారు.

కదలవని వదిలేశారు!

- మూలకు చేరిన ప్రభుత్వ వాహనాలు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా

అరసవల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అవి లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఖరీదైన వాహనాలు. ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవలందించేందుకు ఉద్దేశించినవి. ఆ వాహనాలు చిన్నపాటి మరమ్మతులకు గురైనా సరే.... వాటిని ఓ మూలన పడేస్తున్నారు. దీంతో నెలలు... సంవత్సరాల తరబడి అవి అలాగే ఉండిపోయి... తుప్పపట్టి... ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇటు ప్రభుత్వ ధనం వృథా.... అటు సేవలకు ఆటంకం. నిజానికి సమస్యలు తలెత్తిన వెంటనే ఆ వాహనాలకు మరమ్మతులు చేయిస్తే ప్రజలకు ఎంతోకాలం సేవలందించగలవన్నది జగమెరిగిన సత్యం. ఆ దిశగా ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే చెప్పాలి. చాలా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో ఇటువంటి వాహనాలు తుప్పు పట్టిపోతూ మనకు దర్శనమిస్తుంటాయి. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇలాగే తుప్పు పడుతున్న వాహనాలు ఎన్నో ఉన్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి... ప్రజాధనం వృథా కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటే ఈ దుస్థితి తప్పుతుంది.



వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో తుప్పు పడుతున్న వాహనాలు



హిమగిరి ప్రాంతంలో పంట పొలాల్లోకి చేరిన మట్టి

పొలాల్లో ఇసుక మేటలు

- దిక్కుతోచని స్థితిలో రైతులు

పలాస రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలాస మండలం దానగొర, హిమగిరి గిరిజన ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. భారీ వర్షం ధాటికి కొండల పక్కనున్న పొలాల్లోకి వర్షపు నీటితో పాటు మట్టి జారి పోవడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసి మూడు రోజులైనా కనీసం వ్యవసాయాధికారులు పంట నష్టాలను పరిశీలించడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లొత్తూరు, హిమగిరి, దానగొర ప్రాంతంలో గత నెలలో కురిసిన వర్షాలకు కూడా నష్టం వాటిల్లిందని తెలిపారు. దసరా రోజు కురిసిన భారీ వర్షానికి పూర్తిగా మట్టి పంట పొలాలో మేట వేసిందని చెబుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



దానగొరలో పొలంలో నిలిచిన నీరు

తీరానికి తాటి!

(మూడో పేజీ తరువాయి)

దాల్చుతుండడంతో తీరం కోతకు గురవుతోందని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, పోలాకి, సోంపేట, మందస, ఇచ్ఛాపురం, కవిటి తీరంలోనే కోత అధికంగా కనిపిస్తోంది. తీరప్రాంతం కోతకు ఉష్ణ మండల తుఫాన్లు , రుతుపవనాల సీజన్‌లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, పోర్టులు, హార్బర్ల నిర్మాణం, మడ అడవుల నరికివేత, సముద్ర జలాలు కలుషితం కావడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల కలయికతో సముద్ర జలాల ఆమ్లీకరణ వంటివి కారణాలుగా పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అందుకే తీరంలో పెద్దఎత్తున తాటిచెట్లను పెంచడం ద్వారా విపత్తుల నష్టాన్ని నియంత్రించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులంతా 'ఈపంట' నమోదు చేయించుకోవాలి

కవిటి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులంతా 'ఈ పంట' నమోదు చేయించుకోవాలని, ఈ దిశలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలో వ్యవసాయాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద ప్రవాహంతో ముంపునకు గురైన పంట పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో నీటి ఉధృతి తగ్గిందని, పంట సస్యరక్షణకు రైతులకు సూచనలందిస్తున్నామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఇంకా 600 టన్నుల యూరియా అవసరమని ఏడీఏ భవానీశంకర్ తెలుపగా ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

క్రీడలతో గుర్తింపు

కవిటి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. బైరిపురంలో బైరిపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీ విజేత లకు సోమవారం బహుమతులు అందించారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించేలా ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రైజ్ సంస్థల అధినేత పి.ప్రవీణ్, రమణ, పి.జగదీష్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు బీమా చేసుకోవాలి

సోంపేట రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు బీమా చేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఆ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన దున్న తులసి కొద్ది నెలల కిందట పాముకాటుకు గురై మృతి చెందగా ఆమె కుటుం బ సభ్యులకు సోమవారం గ్రామీణ బ్యాంకు మంజూరు చేసిన రూ.20 లక్షల బీమా చెక్కును అందించారు. నాబార్డు డీడీఎం రమేష్ కృష్ణ, ఏపీజీబీ మేనేజర్ బి.శేషగిరి, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోండి

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనకు ఈనెల 10న స్థానిక అభ్యుదయ డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాలో 18 ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 1000 ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ అర్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయ సున్న యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు తప్పని సరిగా నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ నెంబరు, బయోడేటా, ఆధార్, విద్యార్హతల ప్రతులు, ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 97049 60160, 63010 45132 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

రేపు రిమ్స్ పారా మెడికల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం రిమ్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్), శ్రీకాకుళంలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.అప్పల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9-00 గంటలకు సదరు అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

అర్జీల పరిష్కారానికి కృషి: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 36 సమస్యలను పరిష్కరించాలని బాధితులు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణం వినతులను విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోండి

గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలను ప్రేరేపిస్తూ యువతను, స్థానికులను తప్పుడు మార్గంలో నడిచేలా చేస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని మూలసవలాపురం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. దందాలు, రౌడీయిజం, సారా, మద్యం, గంజాయి, భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు జిల్లా నలుమూలల చేస్తున్న రౌడీషీటర్ కొర్లయ్య, అతని కుటుంబ సభ్యులు గొల్లపల్లి ఎర్రయ్య, సారిపల్లి శ్రీనివాసరావులపై సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌లో పలు కేసులున్నాయని, వీరు గంజాయి, మద్యం వంటి వాటిని యువతకు, గ్రామస్థులకు అందించి వారిని చెడు మార్గంలో నడిపిస్తూ గ్రామ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారని, తగు చర్యలు తీసుకో వాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బౌద్ధ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

సరుబుజ్జిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రొట్టవలస సమీపంలోని దంతపురి క్షేత్రంలో ఈనెల 14న నిర్వహించనున్న బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దళిత జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు సదరు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. శాంతి, అహింస, ధర్మ మార్గాలను బోధించిన మహానుభావుడు బుద్ధుడని కొనియాడారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నేతలు కల్లేపల్లి రామ్‌గోపాల్, తైక్వాండో శ్రీను, కంఠ వేణుబాబు, బడే కామరాజు, బోనెల రమేష్, కొంచాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకి విక్రయించకుంటే చర్యలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీకి మాత్రమే మద్యం విక్రయించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చేసిన దాడుల్లో 14 కేసులు నమోదు చేయగా వాటిలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు ఎనిమిది, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు ఆరు ఉన్నా యన్నారు. ఈనెల 5 రోజుల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసు ఒకటి, డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులు 2 నమోదు చేశామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారన్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు

ఇచ్ఛాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి దాసన్నపేట జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఒక్కసారిగా రెండు వైపుల నుంచి వాహనాలు రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రధానంగా ఈ మార్గంలో రెండు బ్యాంకులు ఉండడంతో ఖాతాదారులు వాహనాలను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పెడుతుండడంతో ట్రాఫిక్ సమస్య నిత్యం ప్రజలను వెంటాడు తోంది. బ్యాంకుల వద్ద సరైన పార్కింగ్ సదుపాయం లేకపో వడంతో ఈ సమస్య ఉత్పన్న మవుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి బ్యాంకుల వద్ద పార్కింగ్ స్థలాలుండేలా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.


బ్యాంకుల వద్ద నిత్యం ఇలాగే..

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వినియోగించుకోండి

ఆమదాలవలస, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0లో భాగంగా తగ్గిన ధరలతో వచ్చే ప్రయోజనాలను వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. సోమవారం పట్టణం లోని సెలూన్ షాపులను సందర్శించి సెలూన్ రంగానికి ప్రభుత్వం తగ్గించిన పన్ను రేట్ల వల్ల వ్యాపారులకు కలిగిన లాభాలను వివరించారు. ప్రభుత్వం చిన్న వ్యాపారులపై భారం తగ్గించడమే లక్ష్యంగా జీఎస్టీ 2.0లో సవరణలు చేసిందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ టాక్స్ ఇన్‌స్పెక్టర్లు జామి శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పీరుకట్లకు 'కిమిడి' పరామర్శ

సరుబుజ్జిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్ కుటుంబసభ్యులను మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సోమవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల వెంకటప్పలనాయుడు భార్య, విశ్వప్రసాద్ తల్లి శ్యామ సుందరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వారి స్వగ్రామం బూర్జ మండలం రాజుపేటలో విశ్వ ప్రసాద్ సోదరులను కళావెంకటరావు ఓదార్చి సానుభూతి తెలిపారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణం నాయుడు, టీడీపీ నాయకులు ఉన్నారు.


పరామర్శిస్తున్న కిమిడి కళా వెంకటరావు

శిశుగృహ, బాల సదన్ తనిఖీ

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అరసవిల్లిలోని శిశుగృహ, బాల సదన్ వసతి గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పిల్లల సమస్యలు, వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సరైన ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.


సూచనలిస్తున్న న్యాయాధికారి

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అరసవల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 13 నుంచి 15 వరకు జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి కోరారు. ఈ మేరకు ఎన్జీవో హోమ్‌లో సంఘం నగర కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా హక్కుల సాధనకు ఈ మహాసభల్లో మార్గదర్శనం కానున్నాయన్నారు. సంఘం నేత కె.నాగమణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటలు అమలు చేసేందుకు జీవో తీసుకురావడం దారుణమన్నారు. అనంతరం ఐద్వా నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డి.సూరీడమ్మ, టి.ప్రవీణతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ప్రతినిధులు పి.శ్రీదేవి, కె.జానకి తదితరులు పాల్గొన్నారు.

పొన్నాడ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పొన్నాడ పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ఉపాధి పనుల ప్రతిపాదనకు గాను గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నివాసిత ప్రాంతాలు, కాలనీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తీర్మానించారు. గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్లు, కాలువలు, పశువుల పెంపకానికి షెడ్స్ చెరువులు, బందలు, కోనేర్ల గట్లు బలోపేతం, నారాయణపురం బ్రాంచ్ చానెల్ గట్టుపై మొక్కల పెంపకం చేపట్టాలని కోరారు. అలాగే పొన్నాడ, తెప్పరేవు, వెంకన్న గారిపేట, కమ్మవానిపేట, ముద్దాడపేట, సింహగిరి కాలనీ ల్లో శ్మశాన వాటికలు, ఇంకుడు గుంతలు ఏర్పాటును ఉపాధి పనుల్లో చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఏపీవో శోభాదేవి, సర్పంచ్ నేతింటి యమున, పంచాయతీ కార్య దర్శి వేణు గోపాలరావు, మాజీ సర్పంచ్‌లు పంచిరెడ్డి కృష్ణారావు, నేతింటి నీలమప్పడు, పంచిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడియత్నం దారుణం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం దారుణమని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదరరావు ఒక ప్రక టన విడుదల చేశారు. ఈ దాడికి ప్రయత్నం వ్యక్తి మీద కాకుండా భారత రాజ్యాంగంపై జరిగిందని పరిగణించాలని వారు పేర్కొన్నారు.

గదులు చాలక.. గడపపై బోధన

- వర్షం కురిస్తే గదుల్లోకి చేరుతున్న నీరు
- శిథిలావస్థకు చేరిన భవనం
- ఇదీ లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల పరిస్థితి


శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

సంతబొమ్మాళి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా ప్రస్తుతం గదులు చాలకపోవడంతో ఓ ఇంటి గడపపై విద్యార్థులకు బోధించాల్సివస్తోంది. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్న రెండు భవనాల్లో ఒకటి శిథిలావస్థకు చేరడంతో ఆ భవనం వినియోగంలోలేదు. మిగిలిన డీపీఈపీ భవనంలో 3,4,5 తరగతులు నిర్వహిస్తుండగా 1,2 తరగతులను పాఠశాల సమీపంలోని ఒకరి ఇంట్లోని గడపపై బోధిస్తున్నారు.ఈ నేపథ్యంలో వర్షం కురిస్తే గదులు చాలకపోవడం, పరాయిపంచన బోధన వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు పాఠాలు వరండాల్లో బోధన సాధ్యం కావడం లేదని హెచ్‌ఎం రెడ్డి సూరిబాబు ఉపాధ్యాయిని సావిత్రమ్మ తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాత భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వర్షం కురవడంతో గదుల్లోకి నీరుచేరడం వల్ల గ్రామంలోని ఓ ఇంటి గడపలో ఉపాధ్యాయినితో విద్యార్థులు(ఫైల్)

సౌకర్యాలు లేక..శిథిలావస్థకు చేరి

- తాగునీటి సౌకర్యానికి నోచుకోని వైనం
- ఇదీ పాతపట్నం బస్టాప్‌లో పరిస్థితి


అధ్వానంగా ఉన్న పాతపట్నం ఆర్టీసీ బస్టాప్

పాతపట్నం రూరల్,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పాతపట్నం బస్టాప్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. ఒడిశా సరిహద్దుకావడంతో ఇరురాష్ట్రాల ప్రయాణికులతో ఇక్కడ రద్దీగా ఉంటోంది. దీనికితోడు రెండు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో కనీస మరమ్మతుల లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడకు ప్రతిరోజూ పలాస, శ్రీకాకుళం, టెక్కలి ఆర్టీసీ డిపోలకు సంబంధించిన 50 నుంచి 70 వరకు బస్సులు వస్తుంటాయి. ఇక్కడ నుంచి నిత్యం ఎక్కువగా ఒడిశాకు చెందిన వ్యాపారులు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, టెక్కలి, పలాస తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాప్‌లో ప్రయాణికులు వేచి ఉండడానికి సరైన సౌకర్యాలులేవు. దీంతో పంచాయతీకార్యాలయం వద్ద గల పాతబస్టాప్ నుంచి ప్రైవేటుబస్సులను ఎక్కి గమ్యస్థానా లకు చేరుకుంటున్నారు.ఈనేపథ్యంలో ఆర్టీసీకిరావలసిన ఆదాయానికి గండిపడుతోంది. ప్రధానంగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బయటదుకాణాల్లో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేయాల్సివస్తోందని పలువురు వాపోతున్నారు.విద్యుత్‌దీపాలు లేకపోవడంతో చీకటిపడిన తర్వాత అమావాస్య తలపిస్తోంది. దీంతో ఇక్కడకు ప్రయాణికులు రావడానికి, నైట్‌సర్వీస్ సిబ్బంది ఉండేందుకు భయాందోళన చెందుతున్నారు. బస్టాప్‌ప్రాంగణం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఏపాటి వర్షం కురిసినా నీరుచేరుతోంది. తక్షణమే ఆర్టీసీ అధికారులు స్పందించి ఇక్కడి బస్టాప్‌లో సమస్యలు పరిష్కరించి సౌకర్యాలు కల్పించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి


చంటి(ఫైల్)

మెళియాపుట్టి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగరాజపురం గ్రామానికి చెందిన జి.చంటి (29) సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ పి.రమేష్‌బాబు తెలిపారు. స్థానికులు,పోలీసుల కథనం మేరకు..గంగరాజపురానికి చెందిన ఓఇంటిపై ఇటీవల వీచినగాలులకు విద్యుత్ వైరు పడి ఉంది.దీన్ని తొలగించేక్రమంలో వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చంటి కొంతకాలంగా హైదరాబాద్‌లో కూలి పనులు చేసేవాడు. ఇటీవల గ్రామానికి వచ్చాడు. చంటి తల్లిదండ్రులు కూడా ఇటీవల మృతి చెందారు. ఆయనకు వివాహం కాలేదు. ఈమేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పాతపట్నం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రైలు ప్రమాదంలో ఒకరు..

కంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మఠం కంచిలి సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పలాస రైల్వే పోలీసుల కథనం మేరకు... మృతుడి వయసు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు మధ్య ఉంటుందని, ఆరంజ్, తెలుపు రంగు కలిగిన తువ్వాలు వేసుకుని ఉన్నాడన్నారు. గుర్తుతెలియని రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ కోటేశ్వరరావు 94406 27567, హెచ్‌సీ హరనాథ్ 99891 36143 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఆర్నెళ్ల జైలు శిక్ష

నరసన్నపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన చోరీ కేసులో జలుమూరు మండలంలోని బుడితి జంక్షన్‌కు చెందిన కొర్ల శివకు ఆర్నెళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం స్థానిక జూనియర్ మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారి కె.వాణి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. నరసన్నపేటలోని ఓషాపు వద్ద ఈఏడాది మే 30నపార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ఎచ్చెర్లకు చెందిన సోడిపైడిరాజు ఫిర్యాదుచేశాడు.ఈమేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదుచేశారు. అనంతరం నిందితుడిగాఉన్న కొర్ల శివపై చార్జీసీటు దాఖలు చేశారు. సోమవారం కేసు విచారణలో ఏపీపీ ఆర్.శాంతిసంతోషి నేరం రుజువు చేయడంతో ముద్దాయికి ఆర్నెళ్లజైలు శిక్ష, రూ.500లు జరిమాన విధించారు.

విద్యుత్ తీగె తెగి పడి ఆవు మృతి

జి.సిగడాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగె తెగిపడి ఆవు మృతి చెందగా, మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మర్రివలస పంచాయతీ మానంపేటలో గ్రామం మీదుగా వెళ్తున్న వ్యవసాయ మోటార్లకు వెళ్లే(త్రీఫేజ్) విద్యుత్‌తీగ ఆదివారంరాత్రి 10.30గంటల సమయంలో తెగిపడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బాడిత కనకలక్ష్మికి విద్యుత్‌తీగె తగిలి షాక్‌నకు గురైంది. వెంటనే స్థానికులు అప్రమత్తమై కర్రతో కొట్టి ఆమెను ప్రమాదం నుంచికాపాడారు. అపస్మారక స్థితిలోఉన్న ఆమెను చికిత్సనిమిత్తం రాజాంసామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆమెకు చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బంది వచ్చి విద్యుత్ తీగను తొలగించారు.

సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


పలాస రూరల్:ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రికార్డును తనిఖీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

పలాసరూరల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బీపీఎల్ కార్డుదారులకు అందజేస్తున్న సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని ఆహార కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కోరారు. కొలతల్లో తగ్గింపు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీచేశారు. అనంతరం పురుషోత్తపురంలో డీలరుషాపును పరిశీలించారు.

●హరిపురం, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):భోజనాల్లో నాణ్యత పాటించాలనిరాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మందసమండలంలోని జీఆర్‌పురంలో కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడి భోజనాలపై అడిగి తెలుసుకున్నారు.

●కోటబొమ్మాళి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ పరిశీలించారు.

●టెక్కలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలి బాలికల సమీకృత సంక్షేమ వసతిగృహాన్ని ఆహార కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు.

● సోంపేట/కంచిలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సోంపేట, కంచిలి మండలాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, అంబేడ్కర్ గురుకులాలు,ఎంఎల్‌ఎస్ పాయింట్లను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ ప్రతాప్‌రెడ్డి తనిఖీచేశారు.వాడపాలెం కొత్తూరువసతిగృహంలో తనిఖీ సమయంలోలోటుపాట్లు గుర్తించినట్లు తెలిపారు.హాస్టల్‌లో వారానికిఐదుగుడ్లు పెట్టాల్సి ఉన్నా రెండుఇస్తున్నట్లు తనదృష్టికి వచ్చిందని,దీంతో సదరు వార్డెన్‌కు షోకాజ్‌నోటీస్‌ఇవ్వాలని హాస్టళ్ల ఉన్నతాధికారిని ఆదేశించామ న్నారు.

పట్టాలపై విచారణ నిర్వహించాలి

టెక్కలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ కాలనీ, మండాపోలం కాలనీ, జగనన్న కాలనీల్లో పేదలకు అందించిన పట్టాలపై విచారణ నిర్వహించాలని టెక్కలి నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ సోమవారం ఒకప్రకటనలో డిమాండ్‌చేశారు. టీడీపీ, కాంగ్రెస్ హయాంలో సుమారు 26 ఎకరాల్లో 1,200 పట్టాలు, మండాపోలం, ఎన్టీఆర్ కాలనీల్లో 600 పట్టాలు, వైసీపీహయాంలో పది ఎకరాల్లో సుమారు 220 పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకులు, దళారులు, రెవెన్యూ అధికారులు కలిసి అర్హులైన పేదలకు పట్టాలు అందకుండా బయటి వ్యక్తులకు అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు.

రైతు సేవా సంఘం అధ్యక్షురాలిగా సత్యాలమ్మ

పోలాకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుసేవా సంఘం అధ్యక్షురాలిగా పంగ సత్యాలమ్మను ప్రభుత్వం నియమించినట్లు వెలుగు ఏపీఎం సుశీల ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లలవలస గ్రామానికి చెందిన పంగ సత్యాలమ్మను సెర్ప్ అధికారులు నియమించినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పోలాకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం హెచ్‌ఎం శాంతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.పూర్వవిద్యార్థులు ఆనాటి గురువులను సత్కరించారు. ఈసందర్భంగా ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికోసం రెండులక్షల విరాళం ప్రకటించారు.


ఆనాటి గురువులతో పూర్వవిద్యార్థులు

పిచ్చిమొక్కలు పెరిగి.. ప్రమాదకరంగా మారి

- ఇదీ మందస గ్రామ సచివాలయం ఆవరణలో పరిస్థితి


మందస గ్రామ సచివాలయం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మందస, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మందస గ్రామ సచివాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారిది. ఇక్కడ పాత తహసీల్దార్ కార్యాలయంలో మందస -1,2 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేశారు. కార్యాలయం మధ్య భాగంలోఉన్న ఖాళీ స్థలంలో నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తోంది. ఇక్కడకు పలు పనులపై వచ్చే అర్జీదారులు జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో విషజంతువులు ఉంటాయోమోనని భయాందోళనకు గురవుతున్నారు.దీనికితోడు సచివాలయానికి ఆనుకుని ఇరిగేషన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయం ఆవరణలో కూడా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. తక్షణమే అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించి కార్యాలయాల ఆవరణల్లో శుభ్రం చేయాలని అర్జీదారులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

కాశీబుగ్గ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తపాలా కార్యాలయంలో జాతీయతపాలా వారోత్సవాల్లోభాగంగా బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక సబ్ డివిజన్ హెడ్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కొత్తగా ఆధార్‌నమోదు,బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందజేస్తామని పేర్కొన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు ఉచితంగా అందజేసే ఆధార్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఉయ్యాలపేటలో వైద్య శిబిరం

నందిగాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలపేటలో సోమవారం నందిగాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ జయభారతి, ఏఎన్‌ఎం వెంకటపద్మ, స్థానిక టీడీపీ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌కు కొత్తూరు ఎస్ఐ

కొత్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఎస్ఐ ఎండీ ఆమీర్ ఆలీని మరోసారి వీఆర్‌కు పంపుతూ ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతఏడాది నవంబరులో కొత్తూరు ఎస్ఐగా విధుల్లో చేరారు. పలు అవినీతి ఆరోపణలు ఆధారాలతో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మంత్రి నారా లోకేష్‌కు, ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లడంతో ఆగస్టులో వీఆర్‌కు పంపించిన విషయం విదితమే. అయితే నియోజకవర్గంలోని నాయకుల జోక్యంతో వీఆర్‌కు పంపడం తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా ఇటీవల మండలంలోని ఓగ్రామం నుంచి ఫిర్యాదులు ఎస్పీకి రావడంతో వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

గండ్లకు మరమ్మతులు చేయాలి

మందస,అక్టోబరు 6(ఆంధ్రజ్యో తి): సింగుపురంలో సునాముది, దామోదర సాగరం చానల్‌కు గండ్లుపడడంతో మరమ్మతులు చేపట్టాలని మహేంద్ర రైతుసంఘం నాయకులు బెస్త కామేశ్వరరావు,కొర్ల హేమారావుచౌదరి కోరారు. మందసలో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

జీఎస్టీ సంస్కరణలతో మేలు

- జిల్లాలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

జీఎస్టీ సంస్కరణల వల్ల అన్నీ వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. సోమవారం జిల్లాలోని పలుచోట్ల తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు.

●పాతపట్నం/ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులు, చిరు వ్యాపారులకు లాభదాయకమని, తద్వారా వ్యాపారులు వ్యాపారాన్ని మరింత విస్తరించి గ్రామీణాభివృద్ధికి తోడ్పాటుఅందుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.తీమరలో ఎన్‌డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాగా పాతపట్నంలోని ప్రభుత్వోన్నతపాఠశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాబూరావు, తిరుపతిరావు, విజయ్ పాల్గొన్నారు.

●వజ్రపుకొత్తూరు,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):నగరంపల్లి హైస్కూల్ హెచ్‌ఎం టి.హేమారావు ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, ఉమారావు, కాళిదాసు, ఎం.అప్పలస్వామి, లక్ష్మిపతి పాల్గొన్నారు.

● నరసన్నపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ ఆధ్వర్యంలో జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు హెచ్. మల్లేశ్వరరావు, సురవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

● జలుమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):చల్లవానిపేట కూడలిలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రమాదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● జలుమూరు (సారవకోట) అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని అవలింగి కూరాకుల వీధిలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, ధనుంజయనాయుడు, ముద్దాడ లక్ష్మణరావు, శ్యామలరావు పాల్గొన్నారు.

పలాస అభివృద్ధికి ప్రభుత్వం చొరవ: ఎమ్మెల్యే శిరీష


శిరీషను అభినందిస్తున్న మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

పలాస, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):పలాస అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు కేంద్రీయ విద్యాలయం మంజూరుచేయడమే నిదర్శనమని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిరీషను కలుసుకొని కేంద్రీయ విద్యాలయం మంజూరుకావడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు, కార్యదర్శి ఇప్పిలి తాతయ్య, సహాయ కార్యదర్శి బమ్మిడి బాబూరావు, కోశాధికారి ఉప్పాడ వెంకటరావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదులు స్వీకరించారు. కాగా నియోజకవర్గంలోని అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై శిరీష సమీక్షించారు. ఇప్పటివరకూ ఎన్ని బస్తాల యూరియా, డీఏపీ అందించారో నివేదిక ఇవ్వాలని కోరారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు: ఎంజీఆర్



పాతపట్నం: మాట్లాడుతున్న ఎంజీఆర్

పాతపట్నం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజాదరణను చూసి ఓర్వలేక ఢిల్లీలో ఉంటూ ప్రకటనల రూపంలో ప్రభుత్వంపై విమర్శించి ఉనికినిచాటుకొనే రాజకీయాలకు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్వస్తి చెప్పాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హితవుపలికారు. సోమవారం పాతపట్నంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూప్రభుత్వం అమలుచేస్తున్న ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని మాజీఎమ్మెల్యే రెడ్డిశాంతి విమర్శించడం హాస్యాస్పదమన్నారు. కోట్లాదిరూపాయలు వెచ్చించి చేసిన సేవాకార్యక్రమాలను గుర్తించి ప్రజలు అభిమానించి గెలిపించారన్నారు.ట్రావెల్స్ బస్సుల నుంచి వసూలు చేసుకొనే కర్మపట్టలేదన్నారు. రెడ్డిశాంతిలా వేలాది కోట్ల బ్లాక్‌మనీ లేదన్నారు. ఆయనవెంట నాయకులు పైల బాబ్జీ, టి.తిరుపతిరావు, తేజేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

●కొత్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లెమ్మ పంచాయతీకి చెందిని పతివాడ లక్ష్మీకాంతం, పత్రి ఉమామహేశ్వరావు వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. కార్యక్రమంలో కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, కొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షులు మాతల గాంధి, చోడవరపు రాము, మడపాన రాజారావు, ఎద్దు కృష్ణప్రసాద్, మూగి కృష్ణ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదన

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దబ్బపాడు వద్ద కడపలవాని గెడ్డపై వంతెన నిర్మించేందుకు 89 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్‌అండ్‌బీ డి.సాగర్ తెలిపారు. సోమవారం ఇటీవలకురిసినవర్షాలకు దెబ్బతిన్న పైపు కల్వర్టును పరిశీలించారు.ఈయనతోపాటు ఆర్‌అండ్‌బీ ఏఈ గోపాల్, మోహనరావు ఉన్నారు.

డొమస్టిక్ గ్యాస్ వినియోగాన్ని అరికట్టాలి

టెక్కలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్లు, హోటళ్లలో కమర్షియల్ గ్యాస్ వినియోగించేలా, డొమస్టిక్ గ్యాస్ వినియోగాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాటసమితి నాయకులు టి.సూర్యం, బి.గోవిందరావు, కె.జోగారావు, ఎ.అప్పన్న, బి.గౌతం కోరారు.ఈమేరకు సోమవారం టెక్కలిలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ వినియోగం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయంకూడా ఆదా అవుతుందని తెలిపారు.హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ దుకాణాల్లో డొమస్టిక్ గ్యాస్ వినియోగంపై విచారణ నిర్వహించాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయానికి సోలార్ సేవలు

పాతపట్నం అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి సోలార్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రూఫ్ టాప్ సోలార్‌ను సోమవారం అమర్చారు. ఈసందర్భంగా ఎంపీడీవో హెచ్.రమణమూర్తి మాట్లాడుతూ రూ.3.25 లక్షలతో ఐదు కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్‌ను అమర్చుతున్నట్లు తెలిపారు.దీతో నెలకు కార్యాలయానికి 300 నుంచి 400 యూనిట్ల వరకూ విద్యుత్ ఆదా అవుతుందని, ప్రభుత్వానికి 100నుంచి 300 యూనిట్ల వరకూ విద్యుత్ సరఫరా చేయగలుగుతామని చెప్పారు. ఏటా రూ.35 నుంచి రూ.40వేల విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని తెలిపారు.

శ్రీముఖలింగంలో గ్రామోత్సవం

జలుమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయంలో కొలువుదీరిన వారాహి అమ్మవారి రూపంలో దర్శనమిస్తున్న పార్వతీదేవి, పరమేశ్వరునికి సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. గౌరీ పౌర్ణమి పురస్కరించుకుని ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం గర్భగుడిలో గల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తీసుకొచ్చి అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే చల్లవానిపేటలోని అసిరితల్లి గ్రామదేవతకు మహిళలు ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు.

ఇంటీరియర్ వర్క్‌షాపులో అగ్నిప్రమాదం

కాశీబుగ్గ, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కేటీరోడ్డులో ఓ ఇంటిరియల్ వర్క్ షాపులో సోమవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది. వాల్‌పై అమర్చిన టీవీ, సీసీ సర్క్యూట్‌బాక్స్‌లు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఎంతమేర నష్టం వాటిల్లిందో అంచనా వేయాల్సి ఉందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించేందుకు గ్రామసభలద్వారా ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని ఏపీవో శ్రీదేవి తెలిపారు. లక్ష్మీనర్సుపేటలో సర్పంచ్ ఎం. దివాకర్‌నా యుడు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమావేశం లో ఈసీ సింహాద్రి, కోఆప్షన్ సభ్యుడు రామ్‌నాథ్‌మహాపాత్రో, ఆర్. లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోండి

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అలవాటుచేసుకొంటే మానసిక ప్రశాంతతోపాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని హెచ్‌ఎం ఎడ్ల సింహాచలం తెలిపారు. సోమవారం లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్య వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆహారపు అలవాట్లపై జిల్లా కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎ. ప్రశాంత్‌కుమార్ వివరించారు.

మానవాళికి వాల్మీకి జీవితం ఆదర్శం

కోటబొమ్మాళి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):మహర్షి వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శమని భగవద్గీత ప్రచారకర్త సనపల కరుణ్‌కుమార్ తెలిపారు. ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలోగ్రామస్థులతో కలిసి వాల్మీకి జయంతి నిర్వహించారు.

హెచ్‌సీఎల్‌కు విద్యార్థుల ఎంపిక

టెక్కలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని ఐతమ్‌ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి రూ.4.25 లక్షల ప్రథమ వార్షికవేతనం ప్యాకేజీతో పాన్‌ఇండియా స్థాయిలో ఉద్యోగం పొందారని పేర్కొన్నారు.